క్లుప్తంగా

కార్యకర్తల కుటుంబాలకు వైఎస్సార్ సీపీ సాయం



ఉయ్యూరు రూరల్: పెదఓగిరాల వైఎస్సార్ సీపీ కార్యకర్త ఉండ్రాసి సంతోష్ ప్రమాద వశాత్తు ఇటీవల మృతి చెందారు. వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ ఇన్చార్జి దేవ భక్తుని చక్రవర్తి సూచన మేరకు పార్టీ నాయకుల ఆధ్వర్యంలో కార్యకర్త కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు. గ్రామ దళితులకు చెందిన పార్టీ కార్యకర్త బందెల లోకేష్ కుటుంబానికి మరో రూ.10 వేలను అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు త్రిపురం చంద్రశేఖర్, కళ్లం వేణు గోపాల్ రెడ్డి, అన్నపరెడ్డి రామ కోటి రెడ్డి, మున్నంగి సాయి రెడ్డి, బొమ్మారెడ్డి సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తాం



కంకిపాడు: ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని ఉయ్యూరు ఏఎంసీ చైర్మన్ కొండా ప్రవీణ్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యుడు కొండా నాగేశ్వరరావు అన్నారు. రాజకీయాలకు అతీతంగా కంకిపాడు అంబేడ్కర్ విగ్రహం సెంటరులో కొండా ప్రవీణ్‌కుమార్, కొండా నాగేశ్వరరావులను ఆదివారం ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ జిల్లా వాసులకు, రైతులకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. తుమ్మలపల్లి హరికృష్ణ, బీఎస్పీ జిల్లా నేత గుడే జయప్రకాష్, సర్పంచ్ బాకీ రమణ, ఉప సర్పంచ్ రాచూరి చిరంజీవి, మదర్ థెరిస్సా సంఘం కార్యదర్శి తాడితోటి నరసింహారావు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి సత్తా వెంకటేశ్వరరావు, ప్రతినిధులు కె.శివయ్య, చిట్టూరి నాగేశ్వరరావు, పులి శ్రీనివాసరావు, బి.వెంకట్, విక్రమ్, సుంకర శివ, మునియ్య, తంబళ్ల వీరాస్వామి పాల్గొన్నారు.

మార్కెట్‌లో సమస్యల పరిష్కారానికి కృషి



హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక కూరగాయాల మార్కెట్ యార్డులో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటామని గన్నవరం ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు అన్నారు. నూజివీడురోడ్డులోని కూరగాయాల మార్కెట్‌ను ఆదివారం ఆయన సందర్శించారు. అక్కడి రైతులు, వ్యాపారులు, ముఠా కార్మికులతో ఏఎంసీ చైర్మన్ నరసింహారావు మాట్లాడారు. కూరగాయాల మార్కెట్‌లో కనీస సదుపాయాలు కల్పించాలి ఆయన కోరారు. పారిశుద్ధ్య పరిరక్షణ, తాగునీటి సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలోనే ముఖ్యమైన కూరగాయాల మార్కెట్ కావటంతో ప్రత్యేక ప్రణాళికతో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని నరసింహారావు భరోసా ఇచ్చారు. అనంతరం హనుమాన్‌జంక్షన్‌లో ప్రభుత్వ రైతు బజారు ఏర్పాటు చేయాలని కోరుతూ ఆయనకు స్థానికులు వినతిపత్రం అందించారు. ఏఎంసీ డైరెక్టర్లు గార్లపాటి రాజేశ్వరరావు, శివలీల పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు



గన్నవరం: అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి కోట కృష్ణమోహన్ తెలిపారు. స్థానిక ఎస్సీ ఏరియాలోని అంబేడ్కర్ పార్కులో ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వంచే వరుసగా మూడవ సారి ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న ఉమ్మడి కృష్ణాజిల్లా ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్ బాబును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కోట మాట్లాడుతూ.. ఉపాధి కల్పన అధికారిగా విక్టర్‌బాబు అత్యధిక మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో విశేష కృషి చేశారని చెప్పారు. ఉద్యోగ నిర్వాహణలో ఆయన చిత్తశుద్ధిని గుర్తించిన ఉన్నతాధికారులు వరుసగా మూడు సార్లు ఉత్తమ సేవా పురస్కారాలు అందజేయడం హర్షణీయమన్నారు. ఎంఈఎఫ్ నియోజకవర్గ ఇన్‌చార్జి దేవరపల్లి ఏసుబాబు, నాయకులు మంద వేణు, నిడమర్తి నాగేశ్వరరావు, కలపాల అబ్రహం, జూనపూడి కృష్ణ, కొప్పుల కామేశ్వరరావు, పులపాక పాస్కల్, వేమండ అబినాష్, లాం కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్.. అలంకారప్రాయమేనా!

- జంక్షన్‌లో అలంకారప్రాయంగా మారిన సెంట్రల్ లైటింగ్ పోల్స్
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే అధికశాతం పనులు పూర్తి
- ఏడాదిన్నరగా పట్టించుకోని ప్రస్తుత కూటమి ప్రభుత్వం
- ప్రారంభానికి ముందే ధ్వంసమవుతున్న విద్యుత్ స్తంభాలు





విజయవాడరోడ్డులో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ పోల్స్ : నూజివీడు రోడ్డులో ప్రారంభానికి ముందే విరిగిన సెంట్రల్ లైటింగ్ విద్యుత్ స్తంభం

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్‌లో సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ అలంకారప్రాయంగా మారింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. సార్వత్రిక ఎన్నికల ముందుగానే దాదాపు పనులు పూర్తి అయినప్పటికీ,కూటమి సర్కారు పట్టించుకోకపోవటంతో రాత్రి వేళల్లో జంక్షన్ ప్రధాన రహదారుల్లో ప్రయాణికులు ఇబ్బంది పడుతూ రాకపోకలు కొనసాగిస్తున్నారు. రూ.కోట్లు ప్రజాధనంతోహనుమాన్‌జంక్షన్ ప్రధాన రహదారులు, ముఖ్య కూడళ్లలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ ప్రారంభానికి ముందే కూనారిల్లుతుండటంపై స్థానికుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రూ.9.6 కోట్ల వ్యయంతో..

హనుమాన్‌జంక్షన్‌లోని ప్రధాన రహదారుల్లో రూ.9.6 కోట్ల వ్యయంతో సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. సార్వత్రిక ఎన్నికలకు ముందే టెండర్లు ఖరారు చేసి పనులు ప్రారంభించారు. గత ఏడాది మార్చి నాటికే దాదాపుగా 90 శాతం పనులు పూర్తి చేశారు. విజయవాడరోడ్డు, ఏలూరురోడ్డు, గుడివాడ రోడ్డు, నూజివీడు రోడ్డులో కలిపి మొత్తం ఆరు కిలోమీటర్ల మేర సెంట్రల్ లైటింగ్ స్తంభాలు ఏర్పాటు చేశారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేసిన పనులు ఇవీ..

ఒక్కో విద్యుత్ స్తంభం మధ్య 40 మీటర్ల దూరంతో మొత్తం 150 స్తంభాలు ఏర్పాటు చేశారు. జంక్షన్ మెయిన్ సెంటర్, వేలేరు క్రాస్ రోడ్డు, బైపాస్‌రోడ్డుల వద్ద నాలుగు హై మ్యాక్స్ సెంట్రల్ లైటింగ్ పోల్స్‌ను కూడా ఏర్పాటు చేశారు. కేవలం విద్యుత్ కనెక్షన్లు ఇవ్వటమే తరువాయి. ఈ తరుణంలో ఎన్నికల ఫలితాలు వెలువడి ప్రభుత్వం మారిపోయింది.



జంక్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన హైమాస్క్ లైటింగ్ పోల్

ప్రస్తుత ప్రభుత్వంలో ఎక్కడి పనులు అక్కడే..

రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో ఎక్కడి పనులు అక్కడే నిల్చిపోయాయి. దాదాపు ఏడాదిన్నరగా సెంట్రల్ లైటింగ్ స్తంభాలు ప్రధాన రహదారుల్లో అలంకారప్రాయంగా మారాయి. ప్రభుత్వం మారటంతోనే పనులు నిలిపివేశారని, సెంట్రల్ లైట్లు వెలుగులు జిమ్మటం అనుమానమే అనే గుసగుసలు స్థానికుల్లో మొదలయ్యాయి.

ధ్వంసమైన విద్యుత్ స్తంభాలు..

ప్రధాన రహదారుల్లో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ విద్యుత్ స్తంభాలు ప్రమాదాలకు గురై ధ్వంసమయ్యాయి. మరికొన్ని చోట్ల నేలకు ఒరిగిపోయాయి. మరికొన్ని చోట్ల ఎప్పుడు పడిపోతాయో అన్నట్లు ప్రమాదభరితంగా మారాయి. అధికార కూటమి ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి, రూ.కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన అభివృద్ధి పనులపై శ్రద్ధ చూపించాలని స్థానికులు కోరుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సెంట్రల్ లైట్లు వెలుగులు విరజిమ్మేలా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రజా వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

గన్నవరం: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ ఈ నెల 15న జరిగే చలో కమిషనరేట్ ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజనాల సురేష్ పిలుపునిచ్చారు. ఉంగుటూరు మండలం మానికొండ గ్రామంలో ఆదివారం భవన నిర్మాణ కార్మిక సంఘం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. నాలుగు దశబ్దాల పోరాట ఫలితంగా రాష్ట్రంలో సంక్షేమ బోర్డు ఏర్పాటైందన్నారు. ఈ బోర్డు ద్వారా కార్మికులకు డెత్ క్లెయిమ్‌లు, వివాహ, ప్రసవ కానుకలు వంటి పథకాలు అందాయన్నారు. నిర్వీర్యమైన సంక్షేమ బోర్డును అధికారంలోకి రాగనే పునరుద్ధరిస్తామని నమ్మబలికిన కూటమి ప్రభుత్వం దానిని విస్మరించిందన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు అజ్మీరా వెంకటేశ్వరరావు, యూనియన్ నేతలు మహ్మద్ అబ్దుల్ బారీ, రామరాజు, ఏసుబాబు, నాగేశ్వరరావు, నజీర్, కోటివర్ధన్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా గ్రావెల్, మట్టి అక్రమ తవ్వకాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం మల్లవల్లిలోని ఏపీఐఐసీ పారిశ్రామికవాడ ప్రాంతంలో యథేచ్ఛగా అక్రమ గ్రావెల్, మట్టి తవ్వకాలు సాగుతున్నాయి. అర్థరాత్రి వేళల్లో అక్రమార్కులు భారీ జేసీబీల సహాయంతో గ్రావెల్, మట్టి తవ్వుతూ టిప్పర్లలో తరలిస్తున్నారు. అధికార కూటమి నేతల అండదండలతో రాత్రి సమయంలో ఇష్టారాజ్యంగా మట్టి, గ్రావెల్ బయటకు తరలివెళ్లిపోతోంది. రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు స్పందించకపోవటం విమర్శలకు తావిస్తోంది.

గండిగుంట సొసైటీలో విజిలెన్స్ సీఐ తనిఖీ



గండిగుంట సొసైటీలో ఎరువులు తనిఖీ చేస్తున్న విజిలెన్స్ సీఐ వెంకటేశ్వరరావు

ఉయ్యూరు రూరల్: మండలంలోని గండిగుంట గ్రామ కోపరేటివ్ సొసైటీలో విజిలెన్స్ అధికారులు ఆదివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా కార్యాలయంలోని అధికారులతో ఎరువుల పంపిణీ జరుగుతున్న విషయంపై ఆరా తీశారు. అనంతరం పక్కన ఉన్న గోదాంలో ఎరువుల స్టాకును పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారులు నిస్సీ గ్రేస్‌తో ఎరువుల పంపిణీపై తీసుకుంటున్న జాగ్రత్తల వివరాలు అడిగారు. ఎరువులు రైతులకు అప్పులు ఇస్తున్నారా లేదా అని తెలుసుకున్నారు. విజిలెన్స్ సీఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎరువుల పంపిణీలో ప్రభుత్వ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. కాగా స్థానిక కోఆపరేటివ్ సొసైటీ ద్వారా రైతులకు అందిస్తున్న ఎరువులపై మండల తహసీల్దార్ సురేష్ కుమార్, ఇన్చార్జి ఎంపీడీవో ఎల్. శివశంకర్, ఎంఏవో నిస్సీ గ్రేస్, ఉయ్యూరు పట్టణ సీఐ టీవీ రామారావు, సొసైటీ అధ్యక్షుడు దండమూడి నాగేశ్వరరావు అన్నదాతలకు అందిస్తున్న ఎరువులపై ఆరా తీశారు. ఉయ్యూరు రెవెన్యూ, గండిగుంట గ్రామ పరిధిలో 1800 ఎకరాల ఆయకట్టు ఉందని, ఆ పరిధిలో రైతులందరికీయూరియా ఇతర ఎరువులను నిష్పక్షపాతంగా పంపిణీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్ సురేష్ కుమార్ హెచ్చరించారు.

వైభవంగా వినాయకుడి విగ్రహాల నిమజ్జనం



పెనమలూరులో వినాయకుడి విగ్రహం ఊరేగింపు

పెనమలూరు: పెనమలూరు గ్రామంలో ఆదివారం వినాయకుడి విగ్రహం పెద్ద ఎత్తున ఊరేగించి నిమజ్జనం చేశారు. గ్రామంలో పల్లిపేటలో ఫ్రెండ్స్ అండ్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రులలో భాగంగా గత 11 రోజులుగా వివిధ రకాల పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వినాయకుడి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. బేతాళ నృత్యలు, కోయ కళాకారుల జానపద నృత్యాలు, చిన్నాలు మురళీ కోలాటం, కనక డప్పుల మధ్య ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్తులు వినాయకుడిని దర్శించుకొని కొబ్బరికాయలు కొట్టారు. స్వామివారి లడ్డూని వనమాల ఆంజనేయరావు రూ.95 వేలకు, చిన్న లడ్డూను రూ.31 వేలకు కొంగ నరసమ్మ వేలంలో దక్కించుకున్నారు. రాత్రి వరకు ఊరేగింపు చేసి అనంతరం స్వామివారిని నిమజ్జనం చేశారు.

పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలి



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు పాతపాడు గ్రామంలో ఉచిత వైద్య శిబిరం

పాతపాడు(విజయవాడరూరల్): పాతపాడు గ్రామంలో సుగాలి కాలనీలో ఆదివారం రోటరీక్లబ్ ఆఫ్ విజయవాడ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు బీపీ, షుగర్, కంటి వైద్య పరీక్షలు 150 మందికి నిర్వహించి ఉచితంగా మందులను, కళ్ళజోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎన్.నాగరాజు మాట్లాడుతూ పోషక విలువలు గల ఆకుకూరలు, కూరగాయలు వాడాలన్నారు. అన్నం తక్కువ, కూర ఎక్కువగా ఉండేలా భోజనం చేయాలని సూచించారు. వైద్యులు షేక్ ఫిరోజ్, వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. గిరిజన సంఘం సభ్యులు శిబిరం నిర్వహణకు సహకరించారు.

పీఏసీఎస్ ఆధ్వర్యంలో..

నున్న(విజయవాడరూరల్): ఆయుష్ ఆసుపత్రి సహకారంతో నున్న పీఏసీఎస్ ఆధ్వర్యంలో కన్నిగంటి తల్లీపిల్లల క్లినిక్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. నున్న సొసైటీ చైర్మన్ కలకోటి శ్రీనివాసరెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఉచితంగా వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతోనే శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. బీపీ, షుగర్, జ్వరం, వ్యాధులకు సంబంధించి సుమారు రెండు వందల మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌పీ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ పామర్తి శ్రీనివాసరావు, నున్న పాల సొసైటీ అధ్యక్షుడు బొంతు శ్రీనివాసరెడ్డి, సొసైటీ డైరెక్టర్ గంపా శ్రీనివాస్ యాదవ్, సొసైటీ సీఈఓ తాడంకి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సేవాతత్పరతకు ఐకమత్యం అవసరం



మాట్లాడుతున్న సీహెచ్‌సీ మాజీ చైర్మన్ యలమంచిలి కిషోర్‌బాబు

కంకిపాడు: సేవాతత్పరతకు ఐకమత్యం కూడా అవసరమని సీహెచ్‌సీ మాజీ చైర్మన్ యలమంచిలి కిషోర్‌బాబు అన్నారు. రాజకీయాలకు అతీతంగా కమ్మ సేవా సంఘం ప్రారంభించి ఆదివారం ప్రారంభ ఆత్మీయ సమావేశం కంకిపాడులో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కిషోర్‌బాబు మాట్లాడుతూ కమ్మ సామాజిక వర్గంలో ఆదరణ లేని కుటుంబాలను గుర్తించి వారికి అండగా నిలవాలన్నారు. వారికి అవసరమైన చేయూత సంఘం ద్వారా అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రొఫెసర్ యార్లగడ్డ రామకృష్ణ మాట్లాడుతూ ప్రపంచీకరణ విస్తరించినా మూలాలు మర్చిపోకూడదన్నారు. సామాజికవర్గ ప్రతినిధులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించే దిశగా ముందుకు సాగాలన్నారు. కాకుమాను రమేష్ మాట్లాడుతూ సంఘం ద్వారా సేవా కార్యక్రమాలను సంఘస్తులకు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కొత్తపల్లి సీతారామ ప్రసాద్, మల్లినేని శివకుమార్, బొప్పూడి శివరామకృష్ణ, అన్నే రామారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో స్వయంవర పార్వతీ హోమం



కంకిపాడు: మండలంలోని ఈడుపుగల్లు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పార్వతీసమేత కామేశ్వరస్వామి దేవస్థానం (శివాలయం)లో స్వయంవర పార్వతీ హోమము ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలువురు భక్తులు పీటలపై కూర్చుని స్వామి వార్లకు ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం స్వయంవర పార్వతీ హోమాన్ని భక్తితో నిర్వహించారు. వ్యాపారవృద్ధి, రుణ విమోచనము, సర్వకార్య సిద్ధి జరుగుతాయని భక్తులు విశ్వసిస్తూ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

యూరియా పంపిణీ తీరును పరిశీలించిన కలెక్టర్

ఎకరాకు ఒక కట్ట ఇచ్చారు.. ఇంకా రెండు ఇవ్వాలని కోరిన రైతులు



వివరాలు తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ డీకే.బాలాజీ

పెద్దఆవుటపల్లి(గన్నవరం): ఉంగుటూరు మండలం పెద్దఆవుటపల్లి గ్రామంలో పీఏసీఎస్‌లో యూరియా పంపిణీని ఆదివారం జిల్లా కలెక్టర్ డీకే. బాలజీ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన కలెక్టర్ యూరియా సరఫరా గురించి అడిగి తెలుసుకున్నారు. ఎకరానికి మూడు కట్టల వరకు యూరియా వినియోగిస్తున్నామని, ఇప్పటి వరకు ఒక కట్ట మాత్రమే సరఫరా చేశారని రైతులు తెలిపారు. మిగిలిన యూరియా కట్టలు కూడా త్వరితగతిన సరఫరా చేయాలని కోరారు. స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ.. యూరియా గురించి ఆందోళన చెందవద్దని, రెండు రోజుల వ్యవధిలో పీఏసీఎస్‌కు రెండు లోడ్లు యూరియా సరఫరా చేయనున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో రైతుల ఇళ్లకు వెళ్లిన కలెక్టర్ సచివాలయ సిబ్బందితో చేపట్టిన మెగా అవుట్ రీచ్ గురించి ఆరా తీశారు. యూరియా వినియోగంపై రైతులను చైతన్యవంతులను చేసేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఇకపై యూరియా సరఫరా నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. గుడివాడ ఆర్డీఓ జి.బాలసుబ్రమణ్యం, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ మురళీకిషోర్, ఏడీఏ ఎం.సునీల్, ఎంపీడీఓ ఈ.సత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా సరఫరాపై కలెక్టర్ పరిశీలన

హనుమాన్‌జంక్షన్ రూరల్: జిల్లాలో యూరియా నిల్వలు తగినంత ఉన్నాయని, రైతులకు యూరియా సరఫరాపై ఎప్పటికప్పుడూ పర్యవేక్షణ చేస్తున్నామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ చెప్పారు. బాపులపాడు మండలంలోని వీరవల్లి, కానుమోలు గ్రామాల్లోఆదివారం పర్యటించారు. ఆయా గ్రామాల్లోని పీఏసీఎస్‌లో రైతులకు యూరియా పంపిణీ తీరును పరిశీలించారు. అక్కడి రైతులతో మాట్లాడారు. ఎకరాకు కేవలం రెండు బస్తాల యూరియా సరిపోతుందని, రైతులు అంతకుమించి వినియోగిస్తే భూసారం తగ్గి పంట నష్టం కలుగుతుందని కలెక్టర్ డీకే బాలాజీ వివరించారు. సచివాలయ సిబ్బంది యూరియా సరఫరా, వాడకంపై రైతులకు వివరిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. గుడివాడ ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం, తహసీల్దార్ బండ్రెడ్డి మురళీకృష్ణ పాల్గొన్నారు.

పురుషోత్తపట్నంలో కలెక్టర్ పర్యటన

గన్నవరం రూరల్: మండలంలోని పురుషోత్తపట్నం గ్రామంలో ఆదివారం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పర్యటించి రైతులతో మాట్లాడారు. యూరియా స్థితిగతులపై రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. యూరియా కోసం రైతులు ఆందోళన చెందవద్దని, ధైర్యంగా ఉండాలని సూచించారు. గత ఖరీఫ్ సీజన్‌లో ఇదే సమాయానికి 27 మెట్రిక్ టన్నులు యూరియా రైతులకు అందజేసినట్లు తెలిపారు. ఈ ఏడాది అంతకన్న ఎక్కువ యూరియాను సరఫరా చేశామన్నారు. గ్రామంలో ఇంత వరకు కొందరికి ఒక కోటా యూరియా కూడా రాలేదని, మరికొంత మందికి రెండవ కోటా రావాల్సి ఉందని కలెక్టర్‌కు పలువురు రైతులు విన్నవించారు. ఎకరానికి మూడు కట్టల యూరియా అవసరమని చెప్పారు. పురుషోత్తపట్నం, కొండపావులూరు వెళ్లే మార్గంలో ఊరచెరువు నుంచి నీరు పొంగి లోలెవెల్ కాజ్‌వేపై పారుతుందని రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని, చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకుడు నాదెండ్ల మోహన్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. జిల్లా అధికారులతోపాటు తహసీల్దార్ కేవీ శివయ్య, ఎంపీడీవో టి.స్వర్ణలత, ఏవో శివప్రసాద్, సర్పంచ్ మాదల రోహిణి పాల్గొన్నారు.

ఉయ్యూరు ఆర్డీఓ హెలా షారోన్ పర్యటన



ఉప్పలూరులో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ హెలా షారోన్

కంకిపాడు: యూరియా సమృద్ధిగా సరఫరా చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఉయ్యూరు ఆర్డీఓ హెలా షారోన్ అన్నారు. మండలంలోని ఉప్పలూరు, ఈడుపుగల్లు గ్రామాల్లో ఆదివారం ఆమె విస్తృతంగా పర్యటించారు. గ్రామాల్లో నెలకొన్న యూరియా కొరత, రైతుల ఇబ్బందులపై ఆరా తీశారు. మూడో దశ ఎరువు చల్లటానికి యూరియా అవసరం ఉందని, ఒక్కో ఎకరాకు కనీసం కట్ట యూరియా కావాలని రైతులు వివరించారు. యూరియాతో పాటు కాంప్లెక్సు ఎరువు కూడా సరఫరా చేయాలని కోరారు. ఎరువులు సొసైటీకి వచ్చే విషయం ముందుగా తెలీటం లేదని, కొందరికే తెలుస్తోందని, దీంతో అందరికీ ఎరువులు అందటం లేదని ఫిర్యాదు చేశారు. ఆర్డీఓ మాట్లాడుతూ త్వరలో యూరియా వస్తుందని, రైతులకు ఇబ్బంది ఉండదని తెలిపారు. సొసైటీలు, రైతు సేవా కేంద్రాల్లోనూ యూరియా, కాంప్లెక్సు ఎరువు అందుబాటులో ఉంచి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని, ఆందోళన చెందొద్దని కోరారు. తహసీల్దార్ వీ.భావనారాయణ, ఏఓ వి.ఉషారాణి బాబూరావు, ఏఎంసీ చైర్మన్ అన్నే ధనయ్య, రైతులు పాల్గొన్నారు.

యూరియా వినియోగం తగ్గించాలి

గన్నవరం రూరల్: శాస్త్రవేత్తల సూచనల మేరకు మాత్రమే యూరియాను వినియోగించాలని ఎంపీడీవో టి.స్వర్ణలత అన్నారు. మండలంలోని కొండపావులూరు గ్రామంలో ఆదివారం యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ వరి పంటకు మూడు విడతలలో 25- 30 కిలోల చొప్పున నాట్లు వేసేటప్పుడు, పిలకలు తొడిగే దశ, చిరుపొట్ట దశలో ఎకరానికి 75-90 కిలోల వరకు సరిపోతుందని తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ సలహాలు, సూచనలు తప్పక సరిగా పాటించాలని వివరించారు. మండల వ్యవసాయ అధికారి శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలి



పెనమలూరు: విద్యార్థులు క్రమశిక్షణతో ఉండి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని ప్రముఖ పారిశ్రామికవేత్త అన్నే శివ నాగేశ్వరరావు అన్నారు. కానూరు అన్నే శివనాగేశ్వరరావు, అరుణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా శివనాగేశ్వరరావు మాట్లాడుతూ కన్న తల్లి తండ్రులను, చదువుకున్న పాఠశాలను ఎన్నటికీ మరువరాదన్నారు. పూర్వ విద్యార్థులు ఎక్కడ ఉన్నా వారు చదువుకున్న పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల భవిష్యత్తుకు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా విశ్రాంత హెచ్‌ఎం ఎస్ఎస్.బ్రహ్మంను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్షుడు బొకినాల అజరయ్య, అన్నే రామకృష్ణ కిషోర్, పూర్వ ఉపాధ్యాయుడు రామకృష్ణ, పూర్వ, ప్రస్తుత విద్యార్థులు పాల్గొన్నారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం ఎ.సీతారామపురంలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న జూదశిబిరంపై వీరవల్లి పోలీసులు ఆదివారం దాడి చేశారు. జూదశిబిరం నిర్వహణపై విశ్వసనీయ సమాచారం అందటంతో వీరవల్లి ఎస్ఐ ఎం.శ్రీనివాస్ నేతృత్వంలో పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.26,530, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. చట్టవిరుద్ధంగా పేకాట, కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

కంకిపాడు: వ్యక్తి అదృశ్యం సంఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు.. పెనమలూరు మండలం వణుకూరు గ్రామానికి చెందిన కాటూరి సీతారామయ్య (43) పెయింటింగ్ కార్మికుడు. మద్యానికి బానిసై ఈనెల 5వ తేదీ రాత్రి ఇంట్లో తన భార్యతో వాగ్వాదం అనంతరం ఇంటి నుంచి బయటకు వచ్చేశాడు. అదే రోజు రాత్రి గొడవర్రు వంతెన వద్ద కనిపించాడని, ఆ తరువాత నుంచి కనిపించటం లేదని, కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

అన్నసంతర్పణ



కంకిపాడు: గణేష్ నవరాత్రులు సందర్భంగా కోలవెన్ను గ్రామంలోని మండపాల సెంటరులో శనివారం రాత్రి అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. అన్నప్రసాద పంపిణీని మాజీ సర్పంచ్ తుమ్మల చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంతో పాటుగా పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు. తొలుత వినాయక మండపంలో భక్తులు పూజలు జరిపించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన భజన కార్యక్రమాలు అలరించాయి.